క్లుప్తంగా

నేడు హుండీల లెక్కింపు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీన రసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను నేడు (మంగళవారం) లెక్కించనున్నట్లు ఈఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

19న ఏకసభ్య కమిషన్ పర్యటన

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 19న హనుమకొండలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ పర్యటించనున్నట్లు జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ శమీమ్ అక్తర్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులముల ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండలో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం కింద 01-04-2023 నుంచి 31-03-2024 వరకు కూలీల ద్వారా చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ చేయడానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీ బృందం వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వివిధ గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఆడిట్ బృందానికి ఖర్చుల రికార్డులు పూర్తిస్థాయిలో అప్పగించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని గ్రామాలలో ఆడిట్ బృందం మూడు రోజులు పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి రికార్డులను సరి చూడడం, అవకతవకలను గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. గుర్తించిన అవకతవకలను ప్రజా వేదికలో చదివి వినిపించి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ప్రజా వేదిక ప్రెసిడెంట్ అధికారి సిఫారసు చేస్తారన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

కాళేశ్వరం: పలిమెల మండలం భూములపై విచారణ చేపట్టేందుకు అధికారులకు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలు ఇచ్చినందుకు మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పలిమెల శివారులో గత 50 సంవత్సరాలుగా కాస్తులో ఉన్న రైతులకు సంబంధించిన 102 ఎకరాల భూములకు సంబంధించి అక్రమంగా దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రిజిస్ట్రేషన్ చేశారని రైతులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ స్పందించి విచారణ జరపాలని అధికారులకు ఆదేశించారని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: మండల కేంద్రంలో తుడుందెబ్బ మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రాయికంటి కిరణ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడెం రత్నం, యాసం రాజు, రాజబాబు, సోమరాజు, సమ్మయ్య, నర్సింహారావు, సర్వేశ్వర్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



సారయ్య(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మాచర్ల సారయ్య(57) అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్ నిమ్స్‌లో సోమవారం మృతి చెందాడు. ఆయన గతంలో నీటి సంఘం చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతిపై పలువురు నాయకులు, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ములుగు రూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మల్లంపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన జంగం సురేశ్ (35) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. తల్లితండ్రులు ఇద్దరు గతంలో మృతి చెందారు. సురేశ్ సోదరుడు హనుమకొండలో అతడి కుటుంబంతో జీవిస్తున్నాడు. కాగా, ఆదివారం రాత్రి సమయంలో సోదరుడికి విడియో కాల్ చేసి తనకు పెండ్లి కావడంలేదని జీవితంపై విరక్తిగా ఉందని చనిపోతున్నట్లు తెలిపాడు. మృతుడి సోదరుడు పక్కన వారికి ఫోన్ చేసి చెప్పగా అప్పటికే సురేశ్ ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- సేకరించిన చెత్తను తగలబెడుతున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



కొయ్యూరులో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

మల్హర్: ప్రజా ఆరోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చేలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సెగ్రిగేన్ షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. ఇంటింటా వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

సద్వినియోగం చేసుకుంటే..

మండలంలోని 15 పంచాయతీల్లో అధికారులు సెగ్రిగేషన్‌షెడ్లు నిర్మించారు. ఇంటింటా చెత్త సేకరణకు కోసం 15 ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త వేరుచేసేలా గతంలో ప్లాస్టిక్ డబ్బాలను ఒక్కో ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేశారు. అధికారులు దృష్టిపెడితే ఇంటి వద్దే తడి, పొడి చెత్తలు వేరు చేసుకోవచ్చు. ఫలితంగా ఈ చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి ఎరువుకు మార్చవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తే సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించిన లక్ష్యం నెరవేరుతుంది.

చెత్తను వేరు చేయడం ఇలా..

ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోని సెగ్రిగేషన్ షెడ్డు వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా ప్లాట్ఫారాలపై సూర్యరష్మి తగిలేవిధంగా 3, 4 రోజులు ఆరబెట్టాలి. ఆరబెట్టిన తడిచెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసి నర్సరీల్లో బ్యాగులు నింపడానికి, మొక్కలకు ఎరువుగా వాడాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయించాలి. ఎరువు తయారీకి ఉపయోగపడని పొడిచెత్తలోని కాగితం, గాజు, ఇనుము, ప్లాస్టిక్, పాలిథిన్, లెదర్, బట్టలు వంటి వ్యర్థాలను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్డులోని కంపార వేర్వేరుగా వేయాలి. వేరుచేసిన పొడిచెత్త వ్యర్థాలను వేరువేరు బ్యాగుల్లో కట్టలు స్క్రాప్‌డీలర్లకు విక్రయించాలి.

చెత్తకు నిప్పు..

చెత్తను తరలిస్తున్న సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయడంలో లేదు. దీంతోషెడ్లలో నిర్మించిన కుండీలు వృథాగా పడి ఉన్నాయి. ట్రాక్టర్ల తరలించిన చెత్తను ఊరి పొలిమేరల్లో వేసి నిప్పుపెట్టేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. చెత్తకు నిప్పు పెట్టడంతో వచ్చే పొగతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎంపీఓ విక్రమ్ కుమార్‌ను వివరణ కోసం ఫోన్ ద్వారా ప్రయత్నించగా స్పందించ లేదు.

ఆదాయ పన్నుతో నష్టం

- సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి రాజయ్య



కార్మికులతో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి రూరల్: ఆదాయ పన్ను భారంతో సింగరేణి కార్మికులు నష్టపోతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య అన్నారు. సోమవారం వివిధ గనుల్లో కార్మికులను కలుసుకొని రాజయ్య మాట్లాడారు. ఆదాయపు పన్ను భారంతో నష్టపోతున్న కార్మికులకు కంపెనీలో క్వార్టర్ తీసుకుంటే క్వార్టర్ అద్దె, కరెంటు, నీరు, గ్యాస్ బిల్లులతో కలిపి అదనపు ఆదాయాన్ని చూపుతూ.. యాజమాన్యం మరింత భారం వేస్తున్నదని దీనివలన కార్మికులు మరింత ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. యూనియన్లతో పాటు అసెంబ్లీ ఎన్నికలలో అన్ని పార్టీలు ఆదాయ పన్ను రద్దు చేయిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి కార్మికులకు ఈ ఒప్పందాన్ని అమలుచేసేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనితోపాటే మారుపేర్లతో అనేకమంది కార్మికులు విజిలెన్స్ పెండింగ్ కేసులతో ఇబ్బంది పడుతున్నందున ఈ సమస్యకు పరిష్కారం చూపేలా కార్మిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పలిమెల: మండలంలోని పలిమెల శివారులోని పలు సర్వే నంబర్లలోని తమ 102 ఎకరాల భూమిని అక్రమంగా దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రిజిస్ట్రేషన్ చేయించుకోని ఇబ్బంది పెడుతున్నారని విచారణ చేయించి న్యాయం చేయాలని బాధిత రైతులు వేడుకున్నారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 సంవత్సరాలకు పైగా ఈ భూమిపై కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్నామని, ఈ భూముల పై పూర్తి హక్కులు తమకు ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు భూమిపై కన్నేసి తమకు తెలియకుండానే రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకొని తమకు పట్టాలు రాకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ భూములను దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీపై బదలాయించారని తెలిపారు. వెంటనే ఆయా సర్వే నంబర్లలోని భూముల పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

- వెంకటరామిరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, కార్మికులు

భూపాలపల్లి రూరల్: సింగరేణిలో కార్మికుల భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని భూపాలపల్లి యాక్టింగ్ జనరల్ మేనేజర్ టి.వెంకటరామిరెడ్డి సూచించారు. 55వ వార్షిక రక్షణ భద్రతా పక్షోత్సవాల సందర్భంగా సోమవారం కేటీకే ఓసీ-2లో కమిటీ తనిఖీ బృందం కన్వీనర్ వెంకటేశ్వర్ రావు, భూపాలపల్లి యాక్టింగ్ జనరల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులతో కలసి భద్రత వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి సేకరణలో భద్రత నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు వివిధ ప్రదేశాలను తనిఖీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గుప్తా, కేటీకే ఓసీ 2 మేనేజర్ కృష్ణ ప్రసాద్, కృష్ణయ్య, సేఫ్టీ ఆఫీసర్ ఎండీ నజీర్, ప్రశాంత్, శేషగిరి, ఏఐటీయూసీ నాయకులు మోటపలుకుల రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్ర చిత్రపటానికి క్షీరాభిషేకం

మొగుళ్లపల్లి: మండలానికి 108 వాహనం కేటాయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటానికి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బలహీన వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ రవీందర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, వెంకటేశ్వర రెడ్డి, నరహరి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న మధు



రేగొండ: మాట్లాడుతున్న కిష్టయ్య

- పీసీసీ సభ్యుడు చల్లూరి మధు

భూపాలపల్లి రూరల్: మంత్రి శ్రీధర్ బాబుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పీసీసీ సభ్యుడు చల్లూరి మధు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లూరి మధుతో పాటు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి వెంకటరమణారెడ్డికి లేదన్నారు. భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి బీఆర్ఎస్ నాయకులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోని అభివృద్ధికి సహకరించాలన్నారు. తమ నాయకులను విమర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవాన్, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, శిరుప అనిల్, చల్లా రేణుక, కాంగ్రెస్ నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, అంబాల శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగే అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. నిధులు మంజూరుకాకుండానే శంకుస్థాపనలు చేస్తున్నారనడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నం రవి, పట్టెం శంకర్, షాబీర్ అలీ, వీరబ్రహ్మం, దేవేందర్, భిక్షపతి, తిరుపతి, రవిందర్ రెడ్డి, క్రాంతి, భాస్కర్, తరుణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా 3వ రోజు సోమవారం కొర్కిశాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, గత పీఆర్సీతో నష్టపోయిన వారికి నేషనల్ సర్వీస్ కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ రాకేశ్, ఉపాధ్యాయులు వినయ్, కోటేశ్వర్, శ్యామ్, శ్రీకాంత్, అరుణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఆశవర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ.. నిర్వహించనున్న బస్సు జాతను విజయవంతం చేయాలని సీఐటీయూజిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టుకొండ లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్సు జాత వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు రూ.18,000 వేతనం అమలు చేయాలన్నారు. ఈ నెల 15న నిర్మల్ జిల్లాలో బస్సు జాత ప్రారంభమైందన్నారు. ఈనెల 30 వరకు వరకు అన్ని జిల్లాల్లో తిరిగి 31న ఇంద్రపార్క్ వద్ద సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు, యూనియన్ నాయకులు లక్ష్మి, కుమారి, నిర్మల, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ధర్నా

భూపాలపల్లి రూరల్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని కోరుతూ.. ఈ నెల 18న (టీవీఏసీ) జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద శాంతియుత ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని జేఏసీ కన్వీనర్ మోత్కూరి కోటి, చైర్మన్ తిప్పారపు రాజు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు, జెన్కో ఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతాం..

- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఓదెలు



సభ్యులకు నియామక పత్రం ఇస్తున్న ఓదెలు

చిట్యాల: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణకు సహకరించి అమలు చేయాలని లేని పక్షంలో మాదిగలంగా కలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి తగిన గుణపాఠం చెపుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నేరెళ్ల ఓదెలుమాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డి శంకర్ మాదిగ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాలలకు కొమ్ముకాస్తున్నాడని ఆరోపించారు. అనంతరం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా సావటి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా సావటి రామస్వామి, కార్యదర్శిగా సవటి సదయ్య, సహాయ కార్యదర్శిగా చిలువేరి రాజయ్య, సంయుక్త కార్యదర్శిగా అంకిల భద్రయ్య, కోశాధికారిగా ఎర్ర విజేందర్, ప్రచార కార్యదర్శిగా చిలువేరి భద్రయ్య, ముఖ్య సలహాదారులగా సావటి నర్సయ్య, సమ్మయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారులకు భరోసా



గ్రామంలో పర్యటిస్తున్న కుమారస్వామి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కన్నెపల్లి గ్రామంలో వరి ధాన్యాలు, వరి కంకులను తిని ఐదుగురి గొర్రెల కాపరులకు చెందిన 32 గొర్రెలు మృతి చెందడంతో సోమవారం గ్రామంలో సందర్శించిన జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి బాధితులను ఓదార్చారు. గ్రామంలో ఉన్న మిగతా గొర్రెల మందలను పరిశీలించారు. మహదేవపూర్ మండలం పశు వైద్యాధికారికి తగు సూచనలు ఇస్తూ, గొర్రెలకు చికిత్స జరుగుతున్న విధానాన్ని నిశితంగా పరిశీలించారు. ఆర్థిక సాయం కోసం తగిన ప్రతిపాదనను ఉన్నత అధికారులకు సమర్పిస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట పశువైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నిర్వాహకులు

కాళేశ్వరం: కరీంనగర్ జిల్లా హుజరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను సోమవారం పంపిణీ చేశారు. కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో 160, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 72, మహదేవపూర్ జెడ్పీహెచ్ఎస్ బాలికలలో 74, జెడ్పీహెచ్ఎస్ బొమ్మపూర్‌లో 12, అంబటిపల్లిలో 17 మొత్తం 336 పరీక్ష ప్యాడ్లలను రిటైర్డు టీచర్, ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.అన్నపూర్ణ, పి.సునీత, సరిత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

- ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అభిషేకాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, రామన్నగూడెంలోని ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం శివుడు పుట్టిన జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో పంచామృత అభిషేకాలను నిర్వహించారు. శివుడికి గోదావరి జలంతో జలాభిషేకం, బిల్వ పత్రాలతో ఆకుపూజలను అర్చకులు సాయిశర్మ, రాజ్‌కుమార్, పాపన్నలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, శివమాలధారులు, భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని శివలింగానికి పూజలు చేసి బస్మాభిషేకాలను చేపట్టారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారింది. ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆరుద్ర నక్షత్రం రోజు చేసే పూజలకు కలిగే ఫలితాలను పూజారులు భక్తులకు వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న దాట్ల శ్రీనివాస్

- కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అభిస్తుందని కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 16వవార్డు రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, బాలమృతం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లల తల్లులు, గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకపదార్థాలను క్రమం తప్పకుండా వాడితే పిల్లల్లో ధృడత్వంతోపాటు ఉల్లాసంగా ఉంటారన్నారు. సీడీపీఓగా మల్లీశ్వరి సూపర్వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్ అరుణ, పిల్లలతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన పోరాటంతో రిజర్వేషన్లు

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

ములుగు: సేవాలాల్ సేన పోరాట ఫలితంగానే 10 శాతం గిరిజన రిజర్వేషన్లను పొందడం జరిగిందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు తెలిపారు. సోమవారం ప్రజా రగ్‌జోశ్ యాత్ర ములుగు జిల్లా అధ్యక్షుడు పోరిక రాహుల్ నాయక్ అధ్యక్షతన జిల్లాలోకి ప్రవేశించగా మల్లంపల్లి వద్ద ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు మాట్లాడుతూ.. సేవాలాల్ సేన సాధించుకున్న విజయాలు చాలా ఉన్నాయని గిరిజన తండాలను, గూడాలను గ్రామ పంచాయతీలుగా సాధించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ప్రభుత్వ పాలకులు ఇచ్చిన ప్రతీ హామీని అమలు పర్చాలన్నారు. జీఓ నంబర్ 3ను పునరుద్దరచి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో తొలి విడతగా నిర్వహిస్తున్న ప్రజా రగ్ జోశ్ యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్, రైతు విభాగ అధ్యక్షుడు బద్రు నాయక్, రవినాయక్, అజ్మీర రతన్ సింగ్, డేటావత్ పవన్ కుమార్, భూక్య జంపన్నతో పాటు తదితరులు ఉన్నారు.

భక్తులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ఎదుట అటవీశాఖ ఆధ్వర్యంలో భక్తులకు మామిడి మొక్కలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహదేవపూర్ రేంజర్ రవి మాట్లాడుతూ.. అటవిలో నిప్పు పెట్టవద్దని భక్తులకు, గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట ఎఫ్ఎస్ఓ ఎం.ఆనంద్, ముక్తివనం పార్కు ఇన్‌చార్జ్ తిరుపతి, బేస్‌క్యాంపు సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.